క్లుప్తంగా

'అపూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత అందరూ మిత్రులు పాఠశాలలో చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాజాత

నర్సాపూర్(జి): సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి డీపీఆర్ఓ ఆధ్వర్యంలో సాంస్కృతిక కళాకారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తురాటిలో ఈనెల 7న, టెంబుర్నిలో 8న, చర్లపల్లిలో 9న అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో ఎస్సై సాయికిరణ్

ముధోల్: ఆటలతో శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతామని ఎస్సై సాయికిరణ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ముధోల్‌కే చెందిన రొమ్మొళ్ల సాయి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 10జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10,100ను బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, ద్వితీయ బహుమతిగా రూ.5,050లను గ్రామానికి చెందిన జీవన్, తాటివార్ రమేశ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆరో రోజుకు ఆందోళన

నిర్మల్‌టౌన్: తమకు వేతనాలు ఇవ్వడం లేదని నిర్మల్ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన ఆరోరోజుకు చేరింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. రోడ్లపై చెత్తా చెదారం పేరుకుపోతుందని.. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో కార్మికులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఎన్నిక

భైంసాటౌన్: ముధోల్ తాలూకా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బుద్ధవిహార్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన శంకర్ చంద్రే ఎన్నికవగా ఆదివారం ఆయనను సన్మానించారు. కాంబ్లే సాహెబ్ రావు, అవినాష్, దగ్డే రవి, జంగ్మె సంతోష్, శ్రీనాథ్, సచిన్, రాజు తదితరులు ఉన్నారు.

సౌండ్‌సిస్టం అందజేత


సౌండ్ సిస్టం అందిస్తున్న ఉద్యోగులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో చింత చెట్టు కాండంలో దుర్గాదేవి ప్రతిమ వెలిసిన విషయం తెలిసిందే. ఆదివారం దుర్గామాత ఆలయ కమిటీకి వానల్‌పాడ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరఫున రూ.54 వేల విలువైన సౌండ్‌సిస్టంను కమిటీ సభ్యులకు అందజేశారు. కదారి దశరథ్, గణపతి, భోజారాం, అటోలి భూమన్న, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, సోనాగాంధీ, ఆలయ కమిటీ సభ్యులు జైపాల్‌రెడ్డి, గణేశ్‌పటేల్, నరేందర్, భోజారాం, సిరిమణి, భోజన్న పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవిందనాయక్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ ముసుగూరి ప్రణీత్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం నూతన ఎస్సైని శాలువాతో ఘనంగా సన్మానించారు.

నీటికష్టాలు తీరేదెన్నడు..?

- సరఫరా కాని భగీరథ జలం
- కనీస అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు
- బెంబరకాలనీలో ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు


సింగిల్‌ఫేజ్ మోటారు వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీవాసులు

తానూరు: మండలంలోని బెంబర గ్రామపంచాయతీలోని బెంబరకాలనీలో ప్రజలకు నీటికష్టాలు తప్పడం లేదు. తాగునీటితోపాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఇంటింటికీ శుద్ధజలం అందించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం ఈ కాలనీలో కానరావడం లేదు. ఇక్కడా భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేసినా.. మూడు నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు. బట్టలు ఉతికేందుకు, స్నానాలు చేసేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో 150 కుటుంబాలు..

బెంబర కాలనీలో 150 వరకు కుటుంబాలుండగా 600 వరకు జనాభా ఉంటుంది. ఈ కాలనీలో జనాభాకు అనుగుణంగా రెండు సింగిల్ ఫేజ్ మోటార్లు ఉన్నాయి. ఈ మోటార్ల వద్ద గంటల తరబడి నిరీక్షించి నీటిని తీసుకెళ్తున్నామని ప్రజలు వాపోతున్నారు.

పైపులైన్ పనులు పూర్తయినా..

భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి చేసి కొద్దిరోజులు ట్యాంకులకు నీటిని సరఫరా చేశారు.కానీ ఇంటింటికీ సరఫరా చేయలేదు. మూడు నెలలుగా ట్యాంకుల్లోకి కూడా మిషన్ భగీరథ నీరు రాక గోస పడుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

గోస పడుతున్న గ్రామస్తులు..

తాగునీటితోపాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్నానం చేసేందుకు, బట్టలు ఉతికేందుకు కూడా నీరు దొరకడం లేదని.. నీరు ఉండదనే కారణంతో మా ఇళ్లకు బంధువులు కూడా రావడం మానేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. భగీరథ నీటిని సరఫరా చేయాలని పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చుట్టాలు రావడం లేదు



మా గ్రామంలో నీటి సమస్య ఉండడంతో మా ఊరికి చుట్టాలు రావడం లేదు. పండగ వేళ కూడా బట్టలు ఉతికేందుకు సమీపంలోని వాగులకు వెళ్లాల్సి వస్తోంది. శుభకార్యం జరిగితే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాత్రి సింగిల్‌ఫేజ్ మోటార్ల వద్ద నిరీక్షించి నీటిని తెచ్చుకుంటున్నాం.

– హిరాబాయి, గ్రామస్తురాలు

లైన్ కడుతున్నాం..



కాలనీకి భగీరథ నీరు సరఫరా కావడం లేదు. తెల్ల వారుజామున ఐదు గంటలకు లేచి బోరుమోటార్ల వద్ద నీటి కోసం లైన్ కడుతున్నాం. దీంతో వ్యవసాయపనులకు ఆలస్యంగా వెళ్తున్నాం. అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేసి మా గోస తీర్చాలి.

– పోశానిబాయి, గ్రామస్తురాలు

వెంటనే నీటి సమస్య పరిష్కరిస్తాం

బెంబర కాలనీలో నీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. గ్రామంలో పర్యటించి సమస్య తెలుసుకుంటాం. మిషన్‌భగీరథ నీరు సరఫరా అయ్యేలా చేసి ప్రజల సమస్య పరిష్కరిస్తాం.

– అబ్దుల్ సమద్, ఎంపీడీవో

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


నిర్మల్‌లో పూర్ణకుంభంతో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు


లక్ష్మణచాంద : పొట్టపెల్లిలో బోనాలతో వస్తున్న భక్తులు


నర్సాపూర్ (జి)లో బోనాలతో మహిళలు


అందాకూర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సోన్ : హోమంలో పాల్గొన్న భక్తులు


కన్నపూర్‌లో మంగళహారతులతో మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని ప్రసిద్ధ నందిగుండం దుర్గామాత ఆలయాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ప్రజలు దసరా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పొట్టపెల్లి(కే)లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ప్రధాన వీధులగుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. కమిటీ సభ్యులు జె.శ్రీనివాస్, పి.గంగాధర్, నరేందర్, చిన్నారెడ్డి, మహేశ్, భూమేశ్, వంశీ, సురేశ్, విమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కుర్మెవాడ శ్రీ దుర్గాదేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి గ్రామదేవతలకు, దుర్గాదేవి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు.

కుంటాల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అంబకంటి గ్రామంలో బోనాల జాతర నిర్వహించారు. అందాకూర్‌లో దీక్షాపరులు పూజలు చేయగా నిర్వాహకులు అన్నదానం చేశారు.

సోన్: మండలంలోని సాకెరా గ్రామంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు దుర్గాదేవి లలిత త్రిపురసుందరి మహాలక్ష్మీ అవతారంలో దర్శనమిచ్చింది. లలిత సహస్రనామం, కుంకుమార్చనలు వేదపండితుల మంత్రోచ్ఛరణల నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అమేడి కిషన్, భక్తులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్, అబ్దుల్లాపూర్, ధర్మోర గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. జగదీశ్ పంతులు వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజలు నిర్వహించారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని సోఫినగర్ కాలనీలో నెలకొల్పిన దుర్గాదేవి మండపం నుంచి భక్తులు ఆదివారం స్థానిక నందిగుండం దుర్గామాత ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామదేవతలకు జలాభిషేకం


కుంటాల: ఆలయానికి వెళ్తున్న భక్తులు


కడ్తాల్‌లో గంగనీళ్ల జాతరకు వెళ్తున్న భక్తులు

కుంటాల: గంగనీళ్ల జాతర పురస్కరించుకొని దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గోదావరిలో కుంటాలలోని గజ్జలమ్మ ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం ఆదివారం కుంటాలకు భక్తులు చేరుకున్నారు. గ్రామదేవతల ప్రతిమలకు నదీజలాలతో అభిషేకం చేశారు.

గొడిసెరాలో..

లోకేశ్వరం: మండలంలోని గొడిసెరాలో ఉన్న గంగపోచమ్మ ఆభరణాలను భక్తులు ఆదివారం ఉదయం పక్కనున్న గోదావరి నదికి తీసుకెళ్లి శుద్ధి చేశారు. గంగాజలం తీసుకొచ్చి గ్రామదేవతల ప్రతిమలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక హారతులతో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గంగనీళ్ల జాతర

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఆదివారం గంగనీళ్ల జాతర వైభవంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా బజారత్నూర్ మండలం గిర్నూర్ గ్రామానికి చెందిన పోచమ్మతల్లి ఆభరణాలకు శనివారం సాయంత్రం గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని గోదావరిలో పుణ్యస్నానాల అనంతరం ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం పాదయాత్రగా గ్రామానికి వెళ్లగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డీటీఆర్ పనులు ప్రారంభం

ఖానాపూర్:పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో ఆదివారం 100 కేవీ డీటీఆర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పరిమి లతసురేశ్ మాట్లాడారు. కొన్నేళ్లుగా లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజల విద్యుత్ కష్టాలను తీర్చేందుకే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉమర్, రాము, వాసెఖాన్, ఫైజల్, రాజేందర్, అబ్బుబాయ్, హరీశ్, ఖాజా, వివేక్ తదితరులు ఉన్నారు.

మారణాయుధం కలిగి ఉన్న ఒకరి అరెస్ట్

నిర్మల్‌టౌన్: మారణాయుధం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి చెందిన రాజేశ్ రెస్టారెంట్ నడిపిస్తున్నాడు. ఏదైనా గొడవ జరిగితే అడ్డు వెళ్లడానికి మంచి ఆయుధం ఉండాలని భావించి గుర్తు తెలియని వ్యక్తి వద్ద తల్వార్ కొనుగోలు చేశాడు. దానిని తన షాప్‌లో కౌంటర్ కింద దాచి ఉంచాడు. పట్టణ పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఆదివారం ఆ రెస్టారెంట్‌కు వెళ్లగా అదే సమయంలో తల్వార్‌ను వేరే చోట దాచి పెట్టడానికి వెళ్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాపర్ తీగ చోరీ

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో బాసర–భైంసా రోడ్డుకు సమీపంలో ఎర్రవార్ సందీప్ అనే రైతు చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌తీగను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసి.. అందులోని కాపర్ తీగను ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. అధికారులు స్పందించి తక్షణం ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తే పంటలు ఎండిపోకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు. ఆదివారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు చెప్పినట్లు లైన్‌మెన్ జగదీశ్ తెలిపారు.

'అధికారుల కనుసన్నల్లోనే మొరం దందా'


మాట్లాడుతున్న నంది రామయ్య

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో అనుమతుల్లేకుండా అక్రమ మొరం దందా యథేచ్ఛగా సాగుతోందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలో ఉన్న భూముల్లో కొద్దిరోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా పొక్లెయిన్లతో పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు జరుపుతూ తరలిస్తున్నారని పేర్కొన్నారు. మొరం తవ్వే ప్రాంతానికి వెళ్లే మార్గాన్ని మూసివేసి ప్రభుత్వ భూములకు కంచె వేయకుండా తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మైనింగ్ అధికారులు సైతం వ్యాపారులు ఇచ్చే మాముళ్లకు ఆశపడి పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనిపై చర్యలు అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అభిషేక్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ


కడెం : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


భైంసాలోని రాధాకృష్ణ భవన్‌లో..

కడెం:మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఎల్ఎంఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల వద్ద విద్యార్థినులు ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ స్వరూపరెడ్డి, అధ్యక్షురాలు హారికరెడ్డి, ప్రిన్సిపాల్ లింగన్న, సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులున్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని బ్రాహ్మణగల్లిలో బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాధాకృష్ణ భవన్‌లో బతుకమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోలాటాల నడుమ శోభాయాత్రగా గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటిలో నిమజ్జనం చేశారు. పట్టణంలో ఈనెల 3నే బతుకమ్మ వేడుకలు నిర్వహించగా.. అదేరోజు అమ్మవారి విగ్రహాలు కొలువుదీరిన నేపథ్యంలో బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో ఆలస్యంగా వేడుకలు నిర్వహించారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


నిర్మల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓబీసీ తరఫున ప్రతి మండలానికి 1,000 మందిని సభ్యులుగా లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండాజీ నరేంద్రచారి, ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, ఆకుల కార్తీక్ నాయకులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్లు సుష్మారెడ్డి, సతీశ్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, ఎడ్‌బిడ్ మాజీ సర్పంచ్ దత్తు, ఉపసర్పంచ్ ఉదయ్, పోతన్న తదితరులున్నారు.

కుంటాల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ జీవీ.రమణారావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లింబా(బి) గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల గజేందర్, ప్రధాన కార్యదర్శి తాటి శివ, అశోక్‌కుమార్, సుదర్శన్ పటేల్, శరత్‌గౌడ్, ఎగ్గం నరసింహులు, మాధవరావు, రవి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని అరేపల్లిలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపల్లి శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. లక్క వెంకటరమణ, జంగిలి మల్లయ్య, రాజేశ్వర్, సంతోష్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్, పొట్టపెల్లి(బి) గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కమల్‌నయన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజలను బీజేపీలో సభ్యులుగా చేర్పించారు. మండల ఇన్‌చార్జి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు గోవర్ధన్, రవి, శంకర్, సురేశ్, అశోక్, నర్సయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు


ఆస్పత్రి వద్ద గర్భిణితో పోలీసులు

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామ సమీపంలో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రిలో చేర్పించి పోలీసులు మానవత్వం చాటారు. ఎగ్గాం గ్రామానికి చెందిన గర్భిణి శనివారం అర్ధరాత్రి పురిటినొప్పులతో బాధపడుతూ వాహనాల కోసం ఎదురుచూస్తూ రోడ్డుపై నిల్చొంది. పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సురేశ్, శ్రీధర్‌రెడ్డి గమనించి ఎస్సై శ్రీనివాస్‌రెడ్డికి పరిస్థితి వివరించారు. ఎస్సై ఆదేశాల మేరకు గర్భిణిని పోలీసుల వాహనంలో భైంసాలోని దత్తసాయి ఆస్పత్రిలో చేర్పించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రానిక్ మీడియా భైంసా డివిజన్ కార్యవర్గం

భైంసాటౌన్: ఎలక్ట్రానిక్ మీడియా భైంసా డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో గౌరవాధ్యక్షుడు అబ్దుల్ బషీర్ సమక్షంలో అధ్యక్షుడిగా బోండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దేవ్కె విలాస్, కత్తుల్వార్ దేవేందర్, కార్యదర్శులుగా కుంట రాజేశ్వర్, సతాజి రామకృష్ణ, కోశాధికారిగా గంధం వెంకట్, పీఆర్ఓగా బాలేవార్ రామకృష్ణ, సభ్యులుగా సతీశ్, జి.నాగేశ్, నరేందర్, పవన్, ఇస్మాయిల్, శ్రీకాంత్, గంగాధర్, బాషెట్టి దత్తాత్రి, మురళి, విజయ్, ధర్మారావ్, సత్యనారాయణ, సందీప్, రవి, గోవింద్ ఎన్నికయ్యారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


ఎల్లమ్మ ఆలయం వద్ద మహిళలు

కుంటాల: మండలంలోని అంబకంటిలో ఛత్రసేన యూత్ ఆధ్వర్యంలో మహిళలు బోనాల పండుగ నిర్వహించారు. పాటలు పాడుతూ బోనాలు ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయంలో బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు చేశారు. గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.